ప్రజాశక్తి
మంగళవారం 18 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం

21న జాబ్ మేళా

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో ఈనెల 21న వైటీసీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ, అసెంబ్లీ ట్రైనీ, ప్రొడక్షన్ ట్రైనీ, మిషన్ ఆపరేటర్‌లి ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. డం జరుగుతుందని తెలిపారు. ఈ ఉద్యోగాలకు పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు గల యువతీ యువకులు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాలో 6 కంపెనీలు పాల్గొంటాయని, 250 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.16వేల నుంచి రూ.20వేలు వరకు వేతనం ఇవ్వనున్నారని తెలిపారు. ఆసక్తి గల వారు వివరాలకు 7032060773, 7993795796, 9154662567 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అందని 'ఉపాధి'వేతనాలు

విజయనగరం, మన్యం జిల్లాల్లో రూ.64కోట్ల బకాయి
జనవరి 15 తర్వాత నిలిచిపోయిన లావాదేవీలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఉపాధి కూలీలకు వేతనాలు నిలిచిపోయాయి. సుమారు 51రోజులకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉండడం వల్ల కూలీలంతా ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. మునుపెన్నడూ ఇన్ని రోజులపాటు వేతనాలు పెండింగ్‌లో ఉంచలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ జాతీయ ఉపాధి హామీ చట్టంలో భాగంగా ఏడాదికి 100 రోజులు ఉపాధి పనులు కల్పించాల్సివున్న విషయం విధితమే. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించక పోవడం, రైతులకు సబ్సిడీలు తగ్గిపోవడం, ఎరువులు, పురుగుల మందుల ధరలు, ట్రాక్టర్ అద్దెలు తదితరాలు పెట్టుబడి పెరిగిపోవడం రైతులకు ఉపాధి హామీ పనులే గత్యంతరంగా మారాయి. ముఖ్యంగా తగిన సాగునీటి వనరులు లేకపోవడం వల్ల ఖరీఫ్ పంట ఒక్కటే జీవనాధారం. మిగిలిన సమయంలో ఉపాధి పనులే జీవనాధారం. ప్రధానంగా వ్యవసాయ కార్మిక కుటుంబాలవారికి ఉపాధి పనులు లేకపోతే కొన్ని కుటుంబాల వారికి జీవనోపాధి లేనట్టే లెక్క. ఈనేపథ్యంలోనే ఏడాదికి 200రోజుల పాటు పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వరకు రోజువారి వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కూలీలు, వారి తరపున వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో చట్ట ప్రకారం కూలీలు పని అడిగిన వెంటనే పని కల్పించడం, వారం లేదా పక్షం రోజుల్లో వేతనాలు చెల్లించడం వంటి నిబంధనలు పక్కాగా అమలు చేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఏటా ఉపాధి పనులకు బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తుండగా, కేటాయించిన అరకొర నిధులను దారి మళ్లిస్తోంది. దీంతో, కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదు. ఈ ఏడాది జనవరి 15వ తేదీ నుంచి చేపట్టిన పనులకు వేతనాలు చెల్లించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.800కోట్ల మేర వేతన బకాయి ఉన్నట్లుగా సమాచారం. ఇందులో విజయనగరం జిల్లాలో సుమారు 25లక్షల పనిదినాలకు సంబంధించి రూ.52కోట్లు బకాయి ఉంది. పార్వతీపురం మన్యంలో రూ.12కోట్ల మేర ఉంది. ఇతర పనులు కూడా ఏమీ దొరక్కపోవడం వల్ల ఆర్థికంగా అవస్థలు పడుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

బకాయిలు వెంటనే చెల్లించాలి

ఈ ఏడాది జనవరి 14 నుంచి ఉపాధి పనులకు వెళ్తున్నాం. రెండు నెలలకు పైగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఎండ వేడిని సైతం తట్టుకొని రెండు పూటలా పనులు చేస్తున్నా కూలి అందకపోవడంతో అవస్థలు పడుతున్నాం. నాకు రూ.4వేలు వరకు రావాల్సి ఉంది.

కడియాల చిన్నయ్య, ఆరిక తోట, రామభద్రపురం మండలం

రెండు వారాలుగా పనిచేస్తున్నా

రెండు వారాల నుంచి ఉపాధి పనులు చేస్తున్నాను. నేటివరకు డబ్బులు జమకాలేదు. కూలి అందక పోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. అధికారులు స్పందించి కూలి డబ్బులు చెల్లించాలి.

సునాధి సుభద్ర, పెదబుడ్డిడి, జియమ్మ వలస మండలం

ప్రతి శుక్రవారం .. గృహ నిర్మాణ దినోత్సవం

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రతి శుక్రవారం గృహ నిర్మాణ దినోత్సవంగా పాటించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గృహ నిర్మాణం, వేసవి వేడిమి, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ ఎస్) తగిఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ జిల్లా, మండల స్థాయి అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం గృహ నిర్మాణ కార్యక్రమాలు సామూహికంగా ప్రారంభించాలన్నారు. ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో పర్యవేక్షణ చేసి గృహ నిర్మాణ దినోత్సవం పాటించి జిల్లాకు కేటాయించిన 7 వేల లక్ష్యాలను జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్‌లో రెవెన్యూ సంబంధిత అంశాలు ఎక్కువగా వస్తున్నాయని, వాటి పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. గ్రామ పంచాయతీ అధికారులు ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని స్పష్టం చేశారు. భవన నిర్మాణ అనుమతులు లేకుండా జరగరాదనిఆదేశించారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలకు సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారిని ఆదేశించారు.

పింఛన్లకు ప్రభుత్వ ఆదేశాలు రావాలి

పింఛన్ల మంజూరుకు ప్రభుత్వ ఆదేశాలు రావాలని కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పింఛన్లకు దరఖాస్తులు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు అందిన వెంటనే పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సాసా పెద్ద ఎత్తున చేపట్టాలి

స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా (సాసా) కార్యక్రమాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ అన్నారు. అక్టోబర్ 2 తర్వాత ఎక్కడా అపారిశుధ్యత ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఆయన అన్నారు.

చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలి

వేసవి వేడిమి దష్ట్యా చలివేంద్రియాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. వేడిమి పెరిగిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిసూచించారు. అత్యవసర పనులు ఉంటే బయటకు రావాలని ఆయన అన్నారు. టోపీ, గొడుగు వంటి వస్తువులు నీడ కోసం వాడాలని ఆయన అన్నారు. ఉపాధి హామీ ప్రదేశాల్లో సైతం నీడ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేతనదారులకు నీరు అందుబాటులో ఉంచాలని ఆయన చెప్పారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో ఉపాధి హామీ పనులు చేపట్టకుండా సమయాల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, గృహ నిర్మాణ సంస్థ ఇన్చార్జి డా.పి.ధర్మ చంద్రారెడ్డి, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు ఎం.సుధారాణి, కె.రామచంద్ర రావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్ మన్మథరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి పి.లక్ష్మణరావు, ఐసిడిఎస్ పీడీ డాక్టర్ టి.కనకదుర్గ, సిపిఒ పి.వీర్రాజు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

హెచ్ఆర్ఎస్‌డబ్ల్యు విభాగం అధ్యక్షురాలుగా అప్పలకొండ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం చినమేరంగికి చెందిన రాగాల అప్పలకొండ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాదులోని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మామిడాల మనోహర్ సమక్షంలో మానవ హక్కులపై అవగాహన సదస్సు అనంతరం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షులు కె.విజయ్ కుమార్ (వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ హెూల్డర్) హాజరై ప్రసంగించారు అవినీతి నిరోధం, వేధింపులు, అంటరానితనం నిషేధం, భ్రూణ హత్యల నిర్మూలన, గృహ నిర్బంధం నుంచిరక్షణ భూకబ్జాలు అరికట్టడం మత్తు పానీయాలు డ్రగ్సంజాయి వంటివి అరికట్టేందుకు తీసుకోవాల్సిన వలసిన చర్యలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా రాగాల అప్పలకొండ ను నియమించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు ఇచ్చిన బాధ్యతలను కచ్చితంగా నెరవేరుస్తానని ఆమె అన్నారు


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం

పగడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్
తొలిరోజు 45మంది విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్/టౌన్

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షకు 45మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో 42మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, ముగ్గురు ప్రైవేట్ విద్యార్థులున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పట్టణంలోని ఆర్‌సిఎం సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. కేంద్రంలో పది పరీక్షల నిర్వహణ ను నిశితంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద గాలి, వెలుతురు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను ఉన్నవి, లేనిది చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించి సజావుగా, పగడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులు మాస్ కాపీ చేయకుండా ఇన్విజలెటర్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వేసవి ఉష్ణోగ్రత స్థాయి అధికంగా ఉన్న దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన వైద్య సిబ్బందితో పాటు ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను ముందస్తుగా అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రం వద్ద భద్రతాపరంగా 144 సెక్షన్ అమలు, తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు నిర్దేశిత సమయంలోగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 17 నుంచి 31, ఏప్రిల్ 1 వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 10,455 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్న నేపథ్యంలో ప్రతి పరీక్షా కేంద్రంలో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన వివరించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని, బస్సు సౌకర్యం లేని గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ప్రజా రవాణాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రైల్వే గేట్లు గల గ్రామాల నుంచి విద్యార్థులు ముందుగా బయలు దేరేలా చూడాలన్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో 220 పాఠశాలలకు చెందిన 10,455 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. వీరిలో 10,367 మంది విద్యార్థులు రెగ్యులర్ కాగా, 88 మంది ప్రైవేటుగా పరీక్షలకు హాజరుకానున్నారని అన్నారు. జిల్లా లోని 67 పరీక్షా కేంద్రాలకు 67 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67 మంది శాఖాధికారులు, 3 ఫ్లయింగ్ స్కాడ్ లను నియమించినట్లు తెలిపారు.

ఓపెన్ పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 09.30 గంటల నుంచి 12.30 గంటల వరకు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు 560 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు చెప్పారు. పార్వతీపురంలో 2 కేంద్రాలు, పాలకొండలో 6 కేంద్రాల్లో జరుగుతున్నాయని చెప్పారు.

సబ్ కలెక్టర్ పరిశీలన

స్థానిక చర్చి వీధిలో గల డివిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పరీక్షలు జరిగే తీరును అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు విద్యా శాఖాధికారులు తదితరులు ఉన్నారు.

పాచిపెంట :మండలంలో మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. 214 విద్యార్థులకు ఏడుగురు పరీక్షలకు గైరాజరయ్యారు.

పాలకొండ: మండలంలో ఆరు కేంద్రాల్లో 730 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారైనట్లు డిప్యూటీ కష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన వివేకనంద పాఠశాల, జెడ్‌పి ఉన్నత పాఠశాల, బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో గల పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలతో పాటు గంగంపేట గిరిజన ఆశ్రమం ఉన్నత పాఠశాల, నీలానగరం, బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పదో తరగతి పరీక్షకు 734 మంది హాజరు కావాల్సి ఉండగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ-1 డి.గౌరినాయుడు తెలిపారు. వికలాంగ విద్యార్థులైన గిరిజాల భవానీ ప్రసాద్, త్రిపురాణ పృథ్వీ స్క్రైబర్ సహాయంతో పరీక్ష రాసినట్లు తెలిపారు. వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను ఎంపిడిఒ బి.వెంకటరమణ, గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఎంఇఒ -1 డి.గౌర్నాయుడు పరిశీలించారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 807 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 803 మంది రాశారు. నలుగురు గైర్హాజరు హాజరయ్యారు. భద్రగిరి బాలుర గురుకులం, పిటిజి, టిక్కబాయి, రేగిడి, జిల్లా ఉన్నత పాఠశాల కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు.

కురుపాం : మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో సోమవారం జరిగిన 10వ తరగతి పరీక్షల్లో 662 మంది విద్యార్థులకు 658 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా 4 గురు విద్యార్థులు పరీక్షలకు గైరాజరయ్యారని ఎంఇఒ ఎన్.సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులకు ఉన్న మౌలిక వసతులను పరిశీలించి తాగునీరు మౌలిక వసతులు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

గరుగుబిల్లి : మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ -2 కొండలరావు తెలిపారు. కేజీబీవీ హై స్కూల్, గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎపిఎస్‌డబ్ల్యుఆర్‌జెసి స్కూల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల మొత్తంలో 424 మంది విద్యార్థులు పరీక్షలు హాజరవుతున్నట్లు తెలిపారు. సోమవారం నిర్వహించిన పరీక్షలలో ఏ విద్యార్థి కూడా గైర్హాజరు కాలేదు అని అన్నారు.

సీతంపేట : మండలంలో ఉన్న సీతంపేట బాలికల గురుకుల పాఠశాల హడ్డుబంగి బాలికల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల 10వ తరగతి తరగతి పరీక్ష కేంద్రాలను ఐటీడీఏ పీవో సి యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం సందర్శించారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్నారు

గుమ్మలక్ష్మీపురం : జియమ్మ వలస మండలంలో గల రెండు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చీఫ్ సూపరిడెంట్ గా జి గణేశ్వరరావు డిపార్టమెంటల్ అధికారిగా టి పండు నియమితులయ్యారు. పరీక్షలు జరుగుతున్న తీరును తహశీల్దార్ రెడ్డి ఫకీరు, ఎంఇఒ-2 ముదిలి శ్రీనివాసరావు పరిశీలించారు.

పరీక్ష రాసేందుకు వస్తున్న వికలాంగ విద్యార్థి

పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్దకు చేరుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కురుపాం : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఉమామహేశ్వరి

నాగావళి నది ఆవల విద్యార్థులకు అవస్థలు

కొమరాడ : పదో తరగతి పరీక్షలు రాసేందుకు ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాదీ నాగావళి నది అవతల ఉన్న కొట్టు గ్రామానికి చెందిన విద్యార్థులు నది దాటుకుంటూ కొమరాడ పరీక్షా కేంద్రానికి వచ్చారు. ఈ గ్రామం నుంచి ఐదుగురు విద్యార్థులు పరీక్ష రాసేందుకు వచ్చారు. అయితే నదిలో నీటి ప్రవాహం పూర్తిగా లేకపోవడంతో విద్యార్థులు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా నడుచుకొని పరీక్షా కేంద్రానికి వచ్చారు. అదే నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడేది. వర్షాకాలంలో పాఠశాలలకు తమ గ్రామం నుంచి రావాలంటే నదిపై ప్రమాదకరంగా ప్రయాణం చేసి చదువుకోవాల్సిన దయనీయ పరిస్థితి ఆ గ్రామ విద్యార్థులకు తప్పడం లేదు. ప్రభుత్వం, పాలకులు స్పందించి నాగావళి నదిపై నిర్మిస్తున్న పూర్ణపాడు లాభేసు వంతెనను తక్షణమే పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

మండలంలో మూ కేంద్రాల్లో పదో పరీక్షలు జరిగాయి. స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో 146 మంది విద్యార్థులు, గిరిజన గురుకులంలో 190 మంది విద్యార్థులు, కొమరాడ జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఆరు రూములో 134 మంది పరీక్షలు రాసేందుకు ఏర్పాటు చేశారు. మొదటి రోజు పరుగులు పెడుతూ విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

మార్కెట్ యార్డు వద్ద నిరసన తెలుపుతున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు, ప్రజలు

జీడిపిక్కల పరిశ్రమ మార్కెట్ యార్డులో పెట్టొద్దు

పట్టణాన్ని కాలుష్యం చేయెుద్దు ● పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

కాలుష్యాన్ని పెంచి ప్రజల ప్రాణాలకు ముప్పు చేకూర్చే జీడి పరిశ్రమను పట్టణ నడిబొడ్డున ఏర్పాటు చేయెుద్దని పట్టణ పౌర సంక్షేమ సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం స్థానిక రాయగడ రోడ్డు చివరన గల మార్కెట్ యార్డులో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న జీడిపిక్క పరిశ్రమ పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రజలు రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం పట్టణ కార్యదర్శి పాకల సన్యాసిరావు మాట్లాడుతూ పరిశ్రమలు నివాస ప్రాంతాలకు దూరంగా స్థాపించి, ఉపాధి అవకాశాలు చేకూర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, దీనికి విరుద్ధంగా పట్టణ నడిబొడ్డున జీడి పరిశ్రమ ఏర్పాటు వల్ల దాని ద్వారా వచ్చే పొగ, తేమ, వ్యర్థాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలకు అభివృద్ధి వ్యతిరేకులం కామని, పట్టణ కేంద్రంలో పరిశ్రమ ఏర్పాటు వల్ల భవిష్యత్తులో 1,2,3,4 వార్డుల ప్రజలకు ప్రాణాంతకరమైన వ్యాధులు సంభవించే పరిస్థితి ఉందని అన్నారు. సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలకు దగ్గరగా పరిశ్రమ పెట్టాలని, జిల్లాలో పరిశ్రమలు అవసరమైనప్పటికీ అవి జనావాసాల మధ్యలో వద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే పరిశ్రమ ఏర్పాటుకు నీటి బోర్లు తీయడం, గ్రావెల్స్, ఇసుక, కరెంటు పోల్లు నిర్మాణం చేపట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునఃరాలోచించాలని అన్నారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిఐటియు నాయకులు ఎస్.ఉమామహేశ్వరరావు, బి.సూరిబాబు, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, కార్మికులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో అలసత్వం వద్దు

వారంలోనే పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

వినతుల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో 106 మంది అర్జీదారుల నుంచి వినతులను జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, సబ్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా రెవిన్యూ అధికారితో కలిసి స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారాన్ని అందించాలని తెలిపారు. ధరఖాస్తుదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా సమస్య పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్ విజ్ఞప్తులపై నిర్లక్ష్యం పనికిరాదని తెలిపారు. మండల స్థాయిలో సమస్యలను అక్కడే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన ప్రతి అర్జీని అధికారులు పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అదే సమస్యపై అర్జీదారు పిజిఆర్ఎస్‌కు రాకుండా ఉండేలా సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌ఛార్జి జెసి కె.హేమలత, ఎస్డీసీ పి.ధర్మచంద్రారెడ్డితో పాటు వివిధశాఖలకు చెందిన పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీతంపేట ఐటిడిఎలో...

సీతంపేట : స్థానిక ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతిని సమర్పించారు. ఇందులో 54 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, ఇఇ రమాదేవి, డిడి అన్నదొర, పిహెచ్ఒ వెంకట గణేష్, డిప్యూటీ డిఇఒ రవి ప్రసన్నకుమార్, పశుసంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసరావు, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, వెలుగు ఎపిడి సన్యాసిరావు, సిడిపిఒ రంగలక్ష్మి ఇతర సెక్టోరల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు మన్మధరావు

పెండింగ్ జీతాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- పార్వతీపురం

ఈ ఏడాది జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాల బకాయిలు చెల్లించాలని కోరుతూ జిల్లాలో వున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌లు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వై.మన్మధరావు ఆధ్వర్యాన జరిగిన ధర్నా లో ఆయన మాట్లాడుతూ జనవరి నుంచి జీతాలు చెల్లించకపోవడంతో కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌లు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో వున్నారని చెప్పారు. 2019 నుంచి 2020 ఆగష్టు వరకు జీతాల బకాయిలు పెండింగ్‌లో వున్నాయని, అవి కూడా చెల్లించాలని కోరారు. ప్రతి నెలా జీతాలు చెల్లించాలని, యూనిఫాం పంపిణీ చేయాలని కోరారు. అనంతరం వినతి పత్రం సమర్పించారు.

ఎకరాకు రూ.8 వేలు రాయితీ

ప్రజాశక్తి - మక్కువ

కోకో పంట సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం మూడేళ్ళు పాటు సబ్సిడీగా ఎకరాకు రూ.8 వేలు అందజేస్తుందని ఉద్యానవన శాఖ అధికారిని ప్రత్యూష భాను తెలిపారు. మండలంలోని సిబిల్లి పెద్దవలసలో కోకో పంటలో కొమ్మ కత్తిరింపులు,బీన్స్ క్వాలిటీ పై ఉద్యాన వన శాఖ రైతులకు సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కోకో కొత్తగా వేసుకోతలచిన రైతులకు రాయితీపై మొక్కలు సరఫరా చేస్తామన్నారు. హెక్టారుకు మొదటి ఏడాది రూ.12వేలు, మిగిలిన రెండేళ్లు రూ.4వేలు చొప్పున ఈ రాయితీ లభిస్తుందన్నారు. నీడ గలిగే చోట కోకో పంటను సాగు చేసుకోవచ్చుని, ఐ విల్ ఫామ్ తోటలో అంతర్ పంటగా కూడా సాగు చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో విహెచ్‌ఎ పెంట వేణు రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు పలువురు ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని ఎంఆర్ నగరం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఫైనల్ ఇయర్ చదువుతున్న 66 మంది విద్యార్థులు విప్రో ఆటో లైవ్ ఇన్వేటర్స్, రాయల్ ఎన్ఫీల్డ్ వీల్స్, ఇండియా గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ వంటి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ఆవరణలో ఉద్యోగ విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎ.విలియంకేరి, బిఎస్ఎన్ఎల్ ఎజిఎం పి.సురేష్ కుమార్ చేతుల మీదుగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. జీవితంలో త్వరగా స్థిరపడాలంటే 10వ తరగతి తర్వాత సాంకేతిక విద్యను అభ్యసించడం సులభమైన, తెలివైన మార్గమని ప్రిన్సిపల్ తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు సోమవారం స్థానిక తహశీల్దార్ పి.బాలమురళీకృష్ణకు వినతిని అందజేశారు. పిఆర్‌సి కమిషన్ నియమించి 12వ పిఆర్సి అమలు చేయాలని, బకాయి పడిన డిఎ విడుదల చేయాలని కోరారు. ఇటీవల రిటైర్ అయిన ఉద్యోగులకు పిఎఫ్ మొదలైన బకాయిలు విడుదల చేయాలన్నారు. హెల్త్ కార్డు మీద ఉచిత వైద్యం అన్ని ఆసుపత్రిలో అందించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కె.వి.రమణ, సిహెచ్ అచ్యుతరావు, వి.గోవిందరావు, వెంకటనాయుడు, ఎంవి రమణ, చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రేగులుగూడ, దిగువబుడగరాయి అంగన్వాడి కేంద్రాలు పిఎం జన్మాన్‌లో కొత్తగా మంజూరయ్యాయని ఐసిడిఎస్ సిడిపిఒ పి.రంగలక్ష్మి తెలిపారు. ఈ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు స్థానిక ఐటిడిఎలో ఈనెల 19న ప్రాజెక్టు ఆఫీసర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈనెల 19లోగా తమ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో పులిపుట్టి పంచాయతీలోని రేగులగూడ కాలనీ లో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ సవర భాజన్న, వార్డు మెంబర్లు సుదర్శనరావు, కర్రన్న వెలుగు అసోసియేషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బాణాల క్రాంతికుమార్, సిబ్బందిల ద్వారా సోమవారం నిత్యవసరాలు, టార్పాలిన్లు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాద భాదితులు సవర లక్ష్మణరావు కుటుంబానికి 25 కిలోల బియ్యం, 1 టార్పాలిన్, వంటపాక ప్రమాద బాధితులు సవర చిట్టమ్మ, సవర రామారావులకు ఒకటేసి టార్పాలిన్లు, పశు వులశాల ప్రమాద భాదితులు సవర లక్కయిలకు ఒక్కటేసి టార్పాలిన్ అందించారు.

ప్రమాదాల నివారణకు వాటరింగ్

ప్రజాశక్తి గరుగుబిల్లి

మండల పరిధిలో పెద్దగొడవ గ్రామ రహదారిపై తిరుగుతున్న వాహనాల వల్ల దుమ్ము, దూళి రేగి ఇబ్బందికరంగా ఉందని ప్రజలు చెప్పడంతో స్థానిక ఎస్ఐ రమేష్‌నాయుడు రహదారిపై సోమవారం నీరును చల్లి దుమ్ము, ధూళి వల్ల వాహనదారులకు ఎలాంటి ప్రమాదం సంభవించకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వాహనానికి సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. మలుపు వద్ద నెమ్మదిగా వెళ్లాలని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున తప్పనిసరిగా జాగ్రత్త వహించాలని ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన ఉంచుకొని వాహనాలను నడపాలని అన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న ఎంపిడిఒ

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండల కేంద్రంలో వెలుగు సంస్థ ద్వారా సేంద్రీయ వ్యవసాయ పద్ధతులలో పండించే కాయగూరలు, ఆకుకూరల అమ్మకాలను సోమవారం ప్రారంభించారు. ఎంపిడిఒ సాల్మన్ రాజు ఈ స్టాల్‌ను ప్రారంభించారు. వెలుగు, డ్వాక్రా మహిళా సంఘాలు ద్వారా పలు గ్రామాల్లో సేంద్రీయ వ్యవసాయం ద్వారా పండించే కాయగూరలను అమ్ముతున్నట్లు వెలుగు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు నాగేశ్వరరావు, సుందరారావు, ప్రసాదరావు, కరువులు, చంద్రయ్య వ్యవసాయ సిబ్బంది నిర్మల తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలసలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో జియమ్మవలసలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా తాగునీరు, మజ్జిగ సౌకర్యం ఏర్పాటు చేశారు. గంట శంకర నారాయణ, మజ్జి సింహాచలం, బొడ్డేపల్లి లక్ష్మి నారాయణ, లచ్చిరెడ్డి రమేష్ నాయుడు చలివేంద్రం ఏర్పాటుకు విరాళాలు ఇచ్చారు.

ధర్నా శిబిరం వద్ద రాత్రి భోజనాలు చేస్తున్న గిరిజన రైతులు

జీడి పిక్కలకు కిలోకు రూ.200 ధర కల్పించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఎదుట 48 గంటల ధర్నా నిర్వహించారు. జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, జీడి పిక్కలను రైతు సేవా కేంద్రాలు, జిసిసి ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి ధర్నా శిబిరం వద్ద గిరిజనులు భోజనాలు చేసి అక్కడే నిద్రించారు.

ప్రజాశక్తి-పార్వతీపురం

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు తిరుపతిరావు

సృష్టీ లేదు..సంపదా లేదు

- నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు
- లక్షలాది రూపాయలు బూడిదపాలు
- ప్రకటనలకే పరిమితమవుతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల పరిశుభ్రతతో పాటు ప్రజలు కూడా ఆరోగ్యవంతులుగా ఉంటారన్న ఉద్దేశంతో గత టిడిపి ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి చెత్త సంపద కేంద్రాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి అక్కడ తడి, పొడి చెత్తలను వేరు చేసి ఎరువులుగా తయారుచేసి వాటి ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని ప్రభుత్వం ఆశయంతో ముందుకు వెళ్లినప్పటికీ కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ ఆశయానికి గండి కొట్టడంతో పాటు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఎక్కడికక్కడే చెత్త సంపద కేంద్రాలు మూలన పడి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

మండలంలోని 34 గ్రామపంచాయతీలో ఉపాధి హామీ చట్టం ద్వారా లక్షలాది రూపాయలతో చెత్త సంపద తయారీ కేంద్రాలు నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రచించారు. ఇందులో భాగంగా ఆడారు, బిటివాడ, దశమంతపురం, కంబర, కిమ్మి, కుమ్మరి గుంట, నడిమికెల్లా, నర్సిపురం, నీలానగరం, పనస నందివాడ, రేగులపాడు, తలవరం, తెట్టంగి, వీరఘట్ట, విక్రాంపురం గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాల పనులు పూర్తయ్యాయి. కత్తుల కవిటిలో దాదాపుగా పనులు పూర్తయినప్పటికీ గణాంకలోనికి రాలేదని అధికారులు చెబుతున్నారు. చిదిమి, కంబర వలస, ఎం రాజపురం, పివిఆర్ పురం, వండువ గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు పిల్లర్లకే పరిమితమయ్యాయి. చిట్టిపూడివలస, కె.ఇచ్ఛాపురం, పెదగదబవలస గ్రామాల్లో పునాదుల స్థాయికి పరిమితమయ్యాయి. ఇక చలివేంద్రి, చినగోరకాలనీ, గడగమ్మ, హుస్సేన్ పురం, కొట్టుగుమ్మడ, ఎంవి పురం, తూడి, మూలలంక, యు వెంకంపేట గ్రామాల్లో నేటికీ ఈ కేంద్రాల నిర్మాణాలు చేపట్టలేదు. నడుకూరులో అయితే చెత్త సంపద కేంద్ర నిర్మించేందుకు స్థలమే లేదని అధికారులు చెబుతున్నారు.

రోడ్డు పక్కనే దర్శనమిస్తున్న చెత్త పోగులు

కాలి బూడిదవుతున్న సంపద

గ్రామపంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాల ఏర్పాటుతో పాటు ప్రతి ఇంటికి రెండు రకాలైన తడి, పొడి చెత్త బుట్టలు కూడా పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించేందుకు 72 మంది క్లాప్, షెడ్ మిత్రులను నియమించారు. వీరికి అప్పట్లో స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా నెలకు రూ.6వేలు వేతనం చెల్లించేవారు. సక్రమంగా వారికి వేతనాలు చెల్లించకపోవడంతో విధులకు స్వస్తి పలికారు. గత ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాలు నిర్వహించినప్పటికీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ప్రతి నెలా వీరికి వేతనాలు చెల్లిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నిధులు విస్తారంగా ఖర్చవుతున్నప్పటికీ చెత్త సంపద కేంద్రాల ద్వారా సంపద మాత్రం సృష్టి కావడం లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. చెత్త సంపద కేంద్రాలు లేనప్పటికీ సేకరించిన చెత్తంతా వేరే చోటుకు తరలించి కాల్చి వేస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. సునాయాసంగా సంపద సృష్టించాల్సిఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు లేకపోవడంతో పంచాయతీలకు రావాల్సిన ఆదాయం కూడా కాలి బూడిదవుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా పడి ఉన్న చెత్త సంపద కేంద్రాల నిర్మాణాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపిడిఒ బి.వెంకటరమణ వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తావించగా పనులు పూర్తిచేసి ఈ నెలాఖరుకు వినియోగంలోకి తీసుకొస్తామని వివరణ ఇచ్చారు.

నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రం

పరికరాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో దురిబిలి గ్రామ పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఎస్ఐ పి.నారాయణరావు తన సిబ్బందితో కలిసి జరిపిన దాడుల్లో 700 లీటర్లు సారా తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లపు ఊటను ధ్వంసం చేసి సారా తయారీకి వాడుతున్న పరికరాలను స్వాధీన పరుచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా నాటుసారా తయారు చేసినా, అమ్మినటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గోడౌన్‌లో అగ్నిప్రమాదం

సాలూరు: పట్టణంలోని జైపూర్ రోడ్డులో ఉన్న ఆటోమొబైల్ గోడౌన్‌లో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో పది టైర్లు, స్పేర్ పార్టుల పరికరాలు దగ్ధమయినట్లు స్టేషన్ ఫైర్ అధికారి ఎ.రాజారావు చెప్పారు. జి.మాధవరావు కి చెందిన ఆటోమొబైల్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగిందని తెలిపారు.

బాధితులకు న్యాయం చేస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఫిర్యాదు పైన విచారణ జరిపి తక్షణమే చట్టపరమైన న్యాయం చేస్తామని ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ-ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా ఆయనకు విన్నవించుకున్నారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వా పరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రదాన కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. మొత్తం 14 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ అదాం సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులపై దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలి

గిరిజనులపై భౌతికంగా దాడికి పాల్పడిన అగ్రకులాలు వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఐక్య ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీని కలిసి వినతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాలూరు మండలం తోణాం పంచాయతీ మద్దెనవలసలో గిరిజనులు కూనేటి లక్ష్మణ్, ఆయన భార్య ఝూన్సీపై తమ ఇంటి వద్ద వెళ్లి అగ్ర కులస్తులైన విరాళ్ళ నాగేశ్వరరావు, విరాళ్ల మోహన రావు, ఓరుగంటి మస్తానురావు, ఓరుగంటి కొండలరావు, సిహెచ్ శ్రీనివాసరావు, ఓరుగంటి నాయుడు, ఓరుగంటి రత్తయ్య కుటుంబ సభ్యులతో భౌతికంగా దాడికి పాల్పడ్డారని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి తక్షణమే వారి కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో జెఎసి గౌరవాధ్యక్షులు నిమ్మక జయరాజు, కొండ గొర్రె ఉదయ్ కుమార్, అన్నారావు చంద్రశేఖర్ రామకష్ణ సీతారాం, పుష్పారావు, సిహెచ్ బింగు, మండల గిరిధర్ రావు, కోలక గౌరమ్మ, పల్లా సురేష్ పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవ్‌రెడ్డి

నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపాలిటీలో ప్రతిరోజు కొళాయి నీరివ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఒబిసి జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు, ఆ పార్టీ నాయకులు కోలా కిరణ్ కుమార్ తదితరులు కలెక్టర్ కార్యాల యంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవను కలిసి పార్వతీపురం మున్సిపాలిటీని వేధిస్తున్న తాగునీటి సమస్యపై చర్చించారు. ఈ సందర్భంగా వారు సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాలిటీలో వారానికి, పది రోజులకొకసారి కుళాయిలు వస్తున్నాయని దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతు న్నారని ప్రస్తుతం వేసవి ప్రారంభం కావడంతో ఆ ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయని అన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రతిరోజు తాగునీరు ఇవ్వాలని, ప్రజల నుండి ముక్కు పిండి ట్యాక్స్ వసూలు చేస్తున్నారని, తాగునీరు ఇవ్వటంలో ఎందుకు అంత అలసత్వమని ప్రశ్నించారు. తాగునీరు సరఫరా జరిగే కొన్ని ప్రాంతాల్లో కలుషితమై నీరు వస్తుందని, క్లోరినేషన్ చేసిన శుద్ధమైన నీటిని కుళాయిల్లో ప్రతిరోజు విడుదల చేయాలన్నారు. బలిజిపేట మండలంలో తుమరాడ, బర్లి తదితర గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయనకు వినతి పత్రాన్ని అందించారు. స్పందించిన సబ్ కలెక్టర్ మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

డ్రోన్లతో గాలింపు

ప్రజాశక్తి- గరుగుబిల్లి

ఇటీవల చిన మేరంగి, వీరఘట్టం, గరుగుబిల్లి, సీతానగరం బలిజిపేట ప్రాంతాల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడిన ఒక వ్యక్తిని పట్టుకోవడానికి పోలీసులు డ్రోన్ కెమెరాల ద్వారా తీవ్రంగా గాలిస్తున్నారు. సదరు నిందితుడు నల్లని పల్సర్ మోటార్ సైకిల్ పై, ముఖానికి మాస్కు ధరించి, హెల్మెట్ పెట్టుకొని, తన గుర్తింపును దాచిపెట్టి, గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఒంటరిగా వెళుతున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఆ వ్యక్తి బస్సు కోసం, పొలం పనుల కోసం వెళుతున్న ఒంటరి మహిళలను మంచిగా మాట్లాడి, బండిపై లిఫ్ట్ ఇస్తానని నమ్మించి, కొంత దూరం తీసుకెళ్లి, నిర్మానుష్య ప్రాంతాల్లోకి వెళ్లిన తర్వాత, చుట్టుపక్కల ఎవరూ లేని సమయంలో, వారి మెడలో ఉన్న బంగారు ఆభరణాలను బలవంతంగా తెంపుకొని పారిపోతున్నాడు. ఈ ఘటనలు గతంలో గరుగుబిల్లి ప్రాంతంలో జరిగాయి. ఎస్‌పి మాధవ రెడ్డి ఆదేశాలు ప్రకారం, సిసిఎస్ ఎస్ఐ తిరుపతిరావు, డ్రోన్ హ్యాండిలర్ దేముడుబాబు, గరుగుబిల్లి పోలీస్ సిబ్బంది సదరు నిందుతుడిని పట్టుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని మారుమూల ప్రాంతాలలో చైన్ స్నాచెర్ ని పట్టుకోవడానికి, నాటుసారా బట్టీలు కనుగొనడానికి, పేకాట స్థావరాలను కనిపెట్టడానికి సోమవారం వివిధ ప్రాంతాలలో డ్రోన్ ఎగురవేసి గాలించారు. సదరు వ్యక్తి కనిపిస్తే తమకు సమాచార మివ్వాలని ఎస్ఐ రమేష్ నాయుడు తెలిపారు.

డ్రోన్ కెమెరాలతో గాలిస్తున్న పోలీసులు

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ప్రజలు ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, కొళాయి పన్నులను సంబంధిత యజమానులు ఈ నెలాఖరులోగా నేరుగా మున్సిపల్ కార్యాలయానికి గానీ, మీ వార్డు పరిధిలో గల సచివాలయాలకు గానీ చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయనతో మున్సిపల్ రెవెన్యూ అధికారి రూబెన్, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు జి.వినయ్ కుమార్, బి.ఈశ్వరరావు, పలు సచివాలయాల సెక్రటరీలతో కలిసి పట్టణంలో పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పన్నుల వసూళ్లలో ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పన్నుల బకాయిదారులతో మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా మున్సిపల్ కార్యాలయానికి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు చెల్లిస్తేనే, పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పించడంలో ముందంజలో ఉంటామని, పన్నుల చెల్లింపుకు సహకరించాలని అన్నారు.

ప్రభుత్వ భూమిని రక్షించండి

ప్రజాశక్తి- పార్వతీపురం

పట్టణంలోని కర్షక మహర్షి ఆసుపత్రికు ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 410 వరహాలు గెడ్డలోని ప్రభుత్వ భూమిని రక్షించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ పార్వతీపురం తహశీల్దార్‌కు పిలిచి సంబంధిత విఆర్‌ఒకు నోటీసు ఇచ్చి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములను కాపాడి ప్రభుత్వ ఆఫీస్‌లు నిర్మించాలని డిమాండ్ చేశారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

ఆటోలకు స్టిక్కర్లు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్ నుంచి అజ్జాడ వైపు వెళ్లే ఆటో స్టాండ్‌లో ఆటోలకు ఎస్ఐ ఎం.రాజేష్ స్టిక్కరింగ్ను చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి ఆటో స్టాండ్‌లోనూ ఆటోకు స్టాండ్ స్టిక్కరింగ్ కార్యక్రమం చేపట్టి రోడ్డు ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ప్రభుత్వ నిబంధన పాటించాలన్నారు. రోడ్డు సెఫ్టీ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు కచ్చితంగా లైసెన్సు ఉంచుకోవాలన్నారు. కారు నడిపే వారు సీట్లు బెల్ట్ పెట్టుకోవాలని లేకపోతే జరిమానా విధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది తిరుపతిరావు, నాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెవాసులకు రక్షిత నీరు ఉత్తిదే

ప్రజాశక్తి - సాలూరు రూరల్

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సురక్షితమైన తాగునీరందించాలని ఉద్దేశంతో నిర్మించిన వాటర్ ట్యాంకులు శుభ్రత చేయడంలో అధికారులు, పంచాయతీ పాలకవర్గం గాలికి వదిలేశాయి. ట్యాంకుల నిర్వహణ, క్లోరినేషన్‌పై దృష్టి పెట్టడం లేదు. ముఖ్యంగా సాలూరు ప్రాంతంలో ఎక్కువగా గిరిజన ప్రాంతాలు ఉండడంతో మంచినీటి సదుపాయం కోసం ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు వెచ్చించి ఈ రక్షిత మంచినీటి పథకాలను నిర్మించాయి. అయితే వీటిని నిర్వహణను మాత్రం పట్టించుకోవడంలేదు. ముఖ్యంగా ప్రజలు తాగే నీటి నిర్వహణ పైనే ప్రజారోగ్యం ఆధారపడి ఉందని ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు చెబుతున్నా కిందిస్థాయి అధికారులకు మాత్రం పట్టడంలేదు.

సాలూరు మండలంలో సుమారు 78వాటర్ ట్యాంక్ ఉన్నాయి. సాధారణంగా వాటర్ పదివేల లీటర్లు నింపిన తర్వాత ప్రతిసారి 25 నుండి 40 గ్రాములు బ్లీచింగ్‌తో శుభ్రత చేయాలి. కానీ ఎక్కడా కూడా ఆ పరిస్థితి లేదు. పంచాయతీల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘంతో పుష్కలంగా నిధులు అందించినా ప్రజల ప్రధాన మౌలిక సదుపాయమైన మంచినీటి సరఫరా ట్యాంకుల నిర్వహణ లోపం ఉంది. దీంతో చాలా గ్రామాల్లో నాచు పట్టి కనిపించడం బాధాకరమైన విషయం. ఈ నీటినే ప్రజలు తాగి రోగాల బారినపడుతున్నా ఎవరికీ చీమకుట్టినట్లు కూడా కనిపించడం లేదు. అలాగే మంచినీటి ట్యాంకుల వద్ద, చేతి పంపులు వద్ద సరైన ప్లాట్‌ఫాంలు లేకపోవడంతో అక్కడే నీరు నిల్వ ఉండి దోమలు చేరి ఎక్కువగా మలేరియాకు గురవుతున్నారు. కొన్ని పంచాయతీల్లో క్లోరినేషన్, బ్లీచింగ్ చేసినట్లు కాగితాలపై చూపిస్తున్నా వాటి నిర్వహణ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రతి వాటర్ ట్యాంక్ వద్ద క్లోరినేషన్ జరిగిన తేదీ మళ్లీ ఎప్పుడు జరుగుతున్నదీ అన్న బ్లాక్ బోర్డ్‌ను ఏర్పాటు చేయాలి. కానీ చాలా గ్రామాల్లో బోర్డులైతే ఉన్నాయి కానీ, ఎప్పుడు క్లోరినేషన్ చేశారు, మళ్లీ ఎప్పుడు చేయాలన్నది బోర్డులు మచ్చు కైనా కనిపించడం లేదు. వీటిని ఇలాగే విడిచిపెడితే ట్యాంకులు తొందరలోనే మరమ్మతులకు గురై ప్రజలు రోగాల బారినపడతారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు, పంచాయతీ సిబ్బంది ప్రతి గ్రామంలో గల మంచినీటి ట్యాంకుల నిర్వహణను సక్రమంగా జరిపించాలని కోరుకుంటున్నారు.

రక్షిత మంచినీటి పథకం

శుభ్రతకు నోచుకోని ట్యాంకు

ట్యాంకు శుభ్ర పరిచిన తేదీలు లేని బోర్డు